కొంగరకలాన్ డివిజన్ పరిధిలోని మంగళ్‌పల్లిలో నూతనంగా నిర్మించిన హరివిల్లు రిసార్ట్ ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటీ) ప్రారంభించారు. ఈ సందర్భంగా రిసార్ట్ నిర్వాహకులు పాతూరి రవిగౌడ్, పాతూరి రాజేష్ గౌడ్ లకు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారంలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

-(దశ, ఇబ్రహీంపట్నం)

కిషన్‌రెడ్డి ఆరోపణలు నిరాధారం

❖ అభివృద్ధి నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం: మల్‌రెడ్డి రాంరెడ్డి

దశ, రంగారెడ్డి: మునగనూరు భూముల అంశంపై బీఆర్ఎస్ నేత మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే కిషన్‌రెడ్డి రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. మునగనూరు సర్వే నంబర్ 44లోని భూముల రిజిస్ట్రేషన్లు 2023లో జరిగాయని, ఆ సమయంలో అధికారంలో ఏ ప్రభుత్వం ఉందో ప్రజలకు తెలుసని రాంరెడ్డి అన్నారు. భూముల అంశం తమ దృష్టికి రాగానే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించి, సంబంధిత భూముల్లో ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేయించిన విషయాన్ని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని, భూముల కబ్జాల రాజకీయాలు చేయదని పేర్కొన్నారు. ఫార్మాసిటీ భూముల పరిహారం, ఇబ్రహీంపట్నం బస్‌డిపో పరిసరాలు, మునగనూరు, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో భూ అక్రమాలపై గతంలోనే ప్రశ్నించినట్లు తెలిపారు. గత 14 ఏళ్లుగా ప్రజల భూములను కాపాడేందుకు కృషి చేస్తున్నామని, అవసరమైతే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మాత్రమే తాము కోరుతామని చెప్పారు.అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌పై జరిగిన పెట్రోల్ దాడికి కూడా భూ వివాదాలే కారణమని రాంరెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి రాజకీయ విమర్శలు చేయడం మానుకోవాలని కిషన్‌రెడ్డికి సూచించారు. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హయాంలో మలక్‌పేట్ నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, ప్రస్తుతం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కూడా అధిక అభివృద్ధి నిధులు పొందిన నియోజకవర్గాల్లో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్ల సాధనకు సచివాలయం ముట్టడికి TUJAC పిలుపు

దశ, హయత్ నగర్ : తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్ల సాధన కోసం అతి త్వరలో తెలంగాణ సచివాలయం ముట్టడికి పిలుపునిస్తున్నట్లు TU JAC రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహేశ్ బాబు చోల్లేటి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమకారుల గుర్తింపు (KK) కమిటీ ఉద్యమకారులను చర్చల్లో చివర్లో చేర్చి అవమానిస్తోందని ఆరోపించారు. కమిటీకి కాలపరిమితి నిర్దేశించకపోవడం, ఉద్యమ సంఘాలకు, మహిళా ఉద్యమకారులకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం, దరఖాస్తుల కోసం ఎలాంటి దరఖాస్తు ఫార్మాట్ విడుదల చేయకపోవడం, ఉద్యమకారులకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు అవసరమైన ప్రాథమిక సర్వే నిర్వహించకపోవడం వంటి అంశాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించిన ఆయన, ఉద్యమకారుల హక్కుల సాధన కోసం త్వరలో భారీ స్థాయిలో తెలంగాణ సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ నూతన భవనానికి స్థలం కేటాయించాలి

❖ అశ్వాపురం 'డిపిఓ'కు వినతి

దశ, అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం గ్రామపంచాయతీకి నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుత గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు స్థలాభావం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 1970లో అప్పటి అవసరాలకు అనుగుణంగా నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం కేవలం 150 గజాల విస్తీర్ణంలో ఉండి పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, పలుమార్లు మరమ్మతులు చేసినా ప్రయోజనం లేకపోయిందని తెలిపారు.

సిమెంట్ పెచ్చులు ఊడిపడుతున్నాయని, వర్షాలు కురిస్తే భవనం కూలిపోయే ప్రమాదం ఉందని వివరించారు.2011 జనాభా లెక్కల ప్రకారం 13,500 మంది ఉన్న గ్రామ జనాభా ప్రస్తుతం 20 వేలకు పైగా పెరిగిందని, సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ తదితర ప్రజాప్రతినిధులు సమావేశం నిర్వహించేందుకు కూడా భవనంలో తగిన స్థలం లేదన్నారు. దీంతో గ్రామసభలు, సాధారణ సమావేశాలను చెట్ల కింద, రోడ్లపై నిర్వహించాల్సి వస్తోందని పేర్కొన్నారు. పంచాయతీ ట్రాక్టర్, నీటి ట్యాంకర్ పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో పాటు 21 మంది పారిశుధ్య కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా లేవని తెలిపారు. నూతన భవన నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ కార్యాలయం పక్కనున్న ఖాళీ స్థలం, ఆర్టీసీ స్థలం, వెటర్నరీ ఆసుపత్రి, ఆయుర్వేద ఆసుపత్రి సమీపంలోని ప్రభుత్వ భూములను పరిశీలించాలని వారు సూచించారు. వినతిపై స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి త్వరలో అశ్వాపురం గ్రామపంచాయతీని స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం నూతన భవన స్థల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ అఫ్రీన్ బేగం

దశ, రామన్ పాడు : వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని రామన్‌పాడు గ్రామంలో మహిళా సమాఖ్య సమావేశం గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, సీసీ మేడం, బుక్ కీపర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ అఫ్రీన్ బేగం అంజాద్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రభుత్వం మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తూ వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు సబ్సిడీపై పలు ఉపాధి అవకాశాలు, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలతో పాటు మహిళా సంఘాలకు అనేక ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.ఎం. ఆర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాధా, వార్డు సభ్యుడు పురుషోత్తం, మహిళా సంఘాల కమిటీ అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితురాలికి రూ.15 వేల ఆర్థిక సాయం

దశ, యాచారం: యాచారం గ్రామ పంచాయతీ సిబ్బంది కంబాలపల్లి రామచంద్ర కుమార్తె మాధవి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ప్రమాదం అనంతరం ఆమెకు వైద్య చికిత్స తీసుకొని ఆసుపత్రి నుండి డిచార్జ్ అయ్యింది. చికిత్స అనంతరం ఖర్చులు భరించలేక కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం స్థానికంగా తెలిసిన వెంటనే బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డి మానవత్వంతో స్పందించారు. మాధవి కుటుంబ పరిస్థితిని స్వయంగా తెలుసుకున్న బూడద రామ్ రెడ్డి, ఆమె వైద్య చికిత్సకు తోడ్పాటుగా రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని ఆ ఫౌండేషన్ కమిటీ సభ్యుల ద్వారా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్స ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సహాయం అందుకోవడంతో మాధవి కుటుంబ సభ్యులు బూడిద రామ్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్టకాలంలో ఆదుకున్న ఆయన సేవాభావాన్ని వారు కొనియాడారు. స్థానిక ప్రజలు కూడా బిఆర్ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ, అవసరంలో ఉన్న వారికి ఇలాంటి సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా బిఆర్ఆర్ ఫౌండేషన్ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, విద్య, వైద్యం, అత్యవసర పరిస్థితుల్లో పేదలకు చేయూతనిస్తూ సమాజంలో మంచి గుర్తింపు పొందుతోందని స్థానికులు తెలిపారు. ఈ ఘటన మరోసారి ఫౌండేషన్ సేవా దృక్పథాన్ని చాటిందని వారు అభిప్రాయపడ్డారు.

ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలో కాగడాల ప్రదర్శన

దశ ఓయూ: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఘనంగా కాగడాల ప్రదర్శన నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రామకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యా సంస్కరణలు, జాతీయ విద్యా విధానం, పారదర్శక నియామకాలు, క్యాంపస్ అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలు వంటి అనేక అంశాలపై ఏబీవీపీ చేపట్టిన ఉద్యమాలను వివరించారు. అలాగే గత 78 సంవత్సరాలుగా విద్యార్థి సమాజం కోసం ఏబీవీపీ సాధించిన విజయాలు, విద్యార్థుల సమస్యల పరిష్కారంలో సంస్థ పోషించిన కీలక పాత్రను విద్యార్థులకు తెలియజేశారు. అదేవిధంగా, నేటి యువత ప్రతి ఒక్కరూ దేశభక్తి, జాతీయ భావనతో ముందుకు సాగాలని, దేశ అభివృద్ధిలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని డా.రామకృష్ణ పిలుపునిచ్చారు. విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా సమాజ సేవ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు మరియు జాతీయ విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రెటరీ పృథ్వితేజ, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరిప్రసాద్, స్టేట్ యూనివర్సిటీస్ కో కన్వీనర్ గంధం నరేందర్, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు గెల్లుశేఖర్, మరియు కార్యదర్శి మోక్షిత్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ తన్మై, మోహన్ బాబు,భాస్కర్, వీరబాబు, విజయ్ సింగ్, నితిన్, వివేక్, శ్రీకర్, పృద్వి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

❖ ఎమ్మార్పీఎస్ డిమాండ్

దశ, చిన్నంబావి: వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం కొప్పునూర్ గ్రామ శివారులో దళితుడిపై కులం పేరుతో దూషిస్తూ దాడికి యత్నించిన ఘటనపై ఎమ్మార్పీఎస్, మాదిగ దండోరా నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల ఎమ్మార్పీఎస్ కమిటీ ఆహ్వానం మేరకు జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. బాధితుడు తగరం వెంకటస్వామి తండ్రి చిన్న నరసింహ తెలిపిన వివరాల ప్రకారం, జూన్ 20 రాత్రి కొప్పునూర్ గ్రామ శివారులో నడుచుకుంటూ వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అడ్డగించి కులం పేరుతో దూషిస్తూ దాడికి యత్నించినట్లు ఆరోపించారు. ఈ సందర్భంగా కొమ్ము చెన్నకేశవులు మాట్లాడుతూ, దళితులను కులం పేరుతో అవమానించడం రాజ్యాంగ విరుద్ధమని, నిందితులపై ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు.బాధితకుటుంబానికి రక్షణ కల్పించి గ్రామంలో శాంతిభద్రతలు కాపాడాలని కోరారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ప్రతి నెల నిర్వహించే పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా గ్రామాలను సందర్శిస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దళితులు, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం కొనసాగిస్తుందని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు

❖ తెలంగాణ గీతాలతో అలరించిన వందేమాతరం శ్రీనివాస్ – విద్యార్థులకు ప్రముఖుల ప్రేరణాత్మక సందేశం

దశ ఓయూ: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు గురువారం సాయంత్రం కళాశాల ఆవరణలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రముఖ సంగీత దర్శకుడు, నేపథ్య గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరై తన మధుర గానంతో తెలంగాణ జానపద, ఉద్యమ గీతాలను ఆలపించి విద్యార్థులు, అధ్యాపకులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఆయన పాటలకు విద్యార్థులు చప్పట్లతో అభినందనలు తెలియజేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వందేమాతరం శ్రీనివాస్ మాట్లాడుతూ, "విద్యార్థి దశ జీవితాన్ని మలిచే స్వర్ణయుగం. పుస్తక విజ్ఞానంతో పాటు సంస్కృతి, సాహిత్యం, సంగీతం వంటి విలువలను కూడా అలవర్చుకోవాలి. మన తెలంగాణ గొప్ప చరిత్రను, భాషను, సంస్కృతిని గర్వంగా భావిస్తూ ముందుకు సాగాలి. మీలోని ప్రతిభను వెలికితీసి సమాజానికి ఆదర్శంగా నిలవాలి. కష్టపడి చదివితే ఏ లక్ష్యమైనా సాధించవచ్చు" అని విద్యార్థులకు సూచించారు. ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలగరం మాట్లాడుతూ, "ఉస్మానియా విశ్వవిద్యాలయం దేశంలోనే అత్యున్నత విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. విద్యార్థులు విద్యతో పాటు పరిశోధన, ఆవిష్కరణలు, సామాజిక బాధ్యతలపై దృష్టి సారించి విశ్వవిద్యాలయానికి మరింత పేరు తీసుకురావాలి. క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల విజయానికి పునాది" అని పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం మాట్లాడుతూ, "ఆర్ట్స్ కళాశాలకు శతాబ్దాల చరిత్ర, గొప్ప వారసత్వం ఉంది. ఈ కళాశాల నుంచి ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట సేవలు అందించారు. అదే స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని సమాజాభివృద్ధికి తోడ్పడే వ్యక్తులుగా ఎదగాలి" అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. స్వాతి, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వార్షికోత్సవాన్ని విజయవంతం చేశారు. సంగీతం, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మణుగూరు మనుగడకు సింగరేణికి నూతన బొగ్గు గనులు కేటాయించాలి

❖ వేలాది కుటుంబాల భవిష్యత్తు – పట్టణ అభివృద్ధికి కొత్త గనులే ఆధారం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో : సింగరేణి పారిశ్రామిక కేంద్రంగా పేరొందిన మణుగూరు పట్టణ భవిష్యత్తు, వేలాది కుటుంబాల జీవనోపాధి సింగరేణి సంస్థపై ఆధారపడి ఉన్న నేపథ్యంలో, వెంటనే నూతన బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని స్థానిక ప్రజలు, కార్మిక సంఘాలు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మణుగూరు ప్రాంత అభివృద్ధికి సింగరేణి కీలక భూమిక పోషించిందని, తాటాకు గుడిసెల స్థాయి నుంచి ఆధునిక పట్టణంగా ఎదగడంలో బొగ్గు గనులే ప్రధాన కారణమని వారు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం కొన్ని గనుల్లో బొగ్గు నిల్వలు తగ్గుముఖం పట్టడంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోతుండటంతో పాటు అనుబంధ వ్యాపారాలు కూడా ప్రభావితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణికి కొత్త బొగ్గు గనులు కేటాయిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించడంతో పాటు రవాణా, కాంట్రాక్టులు, చిన్న వ్యాపారాలు, సేవారంగం మరింత అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడుతున్నారు. దీంతో పట్టణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ఊతమిస్తుందని పేర్కొంటున్నారు.

"మా తాతలు, తండ్రులు సింగరేణిలో పనిచేసి ఈ పట్టణాన్ని నిర్మించారు. మా పిల్లలకు కూడా ఇక్కడే ఉపాధి దొరికేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సింగరేణికి కొత్త బొగ్గు గనులు కేటాయించి మణుగూరు మనుగడను కాపాడాలి" అని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దశాబ్దాలుగా విశేష సేవలందిస్తున్న మణుగూరును నిర్లక్ష్యం చేయకుండా, నూతన బొగ్గు గనుల కేటాయింపుపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని పట్టణ భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపేద కుటుంబానికి అండగా 'మేము సైతం' మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్

❖ దహన సంస్కారాల కోసం రూ.3 వేల ఆర్థిక సాయం

మణుగూరు(టౌన్): సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకుంది. ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసునూరి భాస్కర్ సారథ్యంలో మణుగూరు మున్సిపాలిటీ శేషగిరినగర్‌కు చెందిన కాటి లక్ష్మయ్య (60) అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబం ఆర్థికంగా వెనుకబడినదని తెలుసుకుని ట్రస్ట్ స్పందించింది. లక్ష్మయ్య కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిర్వహణ కోసం ట్రస్ట్ తరపున రూ.3,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకుంది. క్లిష్ట సమయంలో ట్రస్ట్ అందించిన సహాయానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ మార్తి శ్రీనివాసరావు యాదవ్, కోశాధికారి రంగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మంగి మల్లికార్జున్ యాదవ్, అంబులెన్స్ డ్రైవర్ ప్రదీప్, ట్రస్ట్ సభ్యుడు పి. జగన్మోహన్‌తో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పినపాక మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చిట్టిమల్ల ప్రసాద్ నియామకం

దశ,పినపాక : పినపాక మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చిట్టిమల్ల ప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గద్దల రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి, మండలంలో చురుకుగా పనిచేస్తున్నందుకు గుర్తింపుగా ఈ బాధ్యతలను అప్పగించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పినపాక మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు చిట్టిమల్ల ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. నియామకంపై స్పందించిన చిట్టిమల్ల ప్రసాద్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గద్దల రమేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఎట్టకేలకు స్పందించిన ఐటీసీ యాజమాన్యం

❖ 24 గంటల ధర్నా తర్వాత చర్చలు సఫలం

❖ రూ.15 లక్షల పరిహారం, మృతుని భార్యకు బిపిసి స్కూల్లో అటెండర్ ఉద్యోగం, ఇద్దరు పిల్లలకు ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య

దశ బూర్గుపాడు: బూర్గం పహాడ్ మండల పరిధిలోని సారపాక లోని ఐటిసి పిఎస్పీడీలు పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు మధ్యాహ్న భోజన సమయంలో అవుట్ పాస్ రాయించుకుని ఇంటికి వచ్చి గుండెపోటుతో మృతి చెందిన వరికూటి నరసింహారావు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుని కుటుంబం,కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనకు ఎట్టకేలకు ఫలితం లభించింది. మృతదేహంతో ఐటీసీ గేటు ముందు కార్మికులు 24 గంటలకు పైగా ధర్నా నిర్వహించారు. దీంతో యాజమాన్యం చర్చలకు దిగింది. పార్టీలకతీతంగా ఐటీసీ యాజమాన్యానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఐటీసీ యాజమాన్యంతో అన్ని యూనియన్ల నాయకులతో జరిగిన చర్చలు సఫలమయ్యాయి.చర్చల్లో కుదిరిన ఒప్పందం ప్రకారం రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియా మృతుని కుటుంబానికి చెల్లింపు మృతుని భార్యకు బిపిసి స్కూల్లో అటెండర్ ఉద్యోగం ఇద్దరు పిల్లలకు ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య అందిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. యాజమాన్యం ఇచ్చిన హామీలతో కార్మికులు ధర్నాను విరమించి మృతదేహాన్ని తరలించారు. అన్ని పార్టీలు,అన్ని సంఘాలు సంయుక్తంగా చేసిన పోరాటం వల్లనే ఈ ఫలితం సాధ్యమైందని యూనియన్ నాయకులు తెలిపారు.

బందగిరిలో ఇంటింటికీ ఓటరు జాబితా సర్వే

దశ,పినపాక : మండలంలోని బందగిరి నగరం గ్రామంలోని 78వ పోలింగ్ బూత్ పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో) జ్యోతితో కలిసి బీఆర్ఎస్ పార్టీ పినపాక మండల సీనియర్ నాయకుడు కొండేరు రాము ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఓటరు జాబితా స్లిప్పులను పంపిణీ చేసి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రజలు ఎన్నికల అధికారులకు సహకరించాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని ఈ సందర్భంగా తెలిపారు.

పెద్దవాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులను ఆదుకోండి: మంత్రి తుమ్మలను కోరిన తాటి

దశ, దమ్మపేట: పెద్దవాగు ప్రాజెక్ట్ దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయకట్టు రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలోని తన నివాసంలో గురువారం ఆయన మాట్లాడుతూ, పెద్దవాగు ప్రాజెక్ట్ గండిపడిన కారణంగా ఆయకట్టు పరిధిలోని రైతులు వరుసగా మూడు పంట సీజన్లుగా తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి కొరతతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పెద్దవాగు ప్రాజెక్ట్ మరమ్మత్తు పనులను అత్యవసరంగా చేపట్టేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్చించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే, పెద్దవాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులతో కలిసి త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలు, పంట నష్టాలను వివరించి తక్షణ పరిష్కారం కోరనున్నట్లు తాటి వెంకటేశ్వర్లు తెలిపారు.

అప్రమత్తమైన అశ్వాపురం పోలీసులు.. ప్రమాదకర గుంత వద్ద హెచ్చరిక చర్యలు

దశ, అశ్వాపురం: మండలంలోని మొండికుంట పెట్రోల్ బంక్ సమీపంలో మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి పక్కన ఏర్పడిన ప్రమాదకర గుంతను అశ్వాపురం పోలీసులు గురువారం గుర్తించి వెంటనే భద్రతా చర్యలు చేపట్టారు. రాత్రి వేళల్లో గుంత స్పష్టంగా కనిపించకపోవడంతో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఆలస్యం చేయకుండా స్పందించారు. గుంత వద్ద హెచ్చరిక సూచనగా డివైడర్‌ను ఏర్పాటు చేసి, వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించేలా చర్యలు తీసుకున్నారు. పోలీసుల సమయోచిత స్పందనతో ప్రమాదాలను ముందుగానే నివారించే ప్రయత్నం చేయడంపై స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల భద్రతే లక్ష్యంగా అశ్వాపురం పోలీసులు వ్యవహరించిన తీరును ప్రశంసిస్తూ "శభాష్ అశ్వాపురం పోలీసులు" అంటూ అభినందనలు తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణలో అదనపు బూత్ లెవల్ అధికారులను నియమించాలి

❖ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుంటా లక్ష్మణ్ డిమాండ్

దశ, మణుగూరు: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు జనాభా ఆధారంగా అదనపు బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) నియమించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుంటా లక్ష్మణ్ ప్రభుత్వాన్ని, ఎన్నికల అధికారులను కోరారు. మణుగూరులో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో వారు మాట్లాడుతూ, అధిక జనాభా ఉన్న బూత్‌ల వద్ద బీఎల్‌వోలపై పని భారం పెరుగుతోందన్నారు. దీంతో ప్రతి ఓటరును చేరుకోవడం, వివరాలను సేకరించడం కష్టతరంగా మారుతోందని తెలిపారు. అందువల్ల జనాభా ప్రాతిపదికన అదనపు బీఎల్‌వోలను నియమించి, ఓటర్ల వివరాలను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఒక్క ఓటు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో ముత్యం బాబు, సత్యం బాబు, ఎడ్ల శ్రీను, అడపా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్రకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా

దశ, అశ్వారావుపేట : బీఆర్ఎస్ పార్లమెంట్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నియమించిన సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మెచ్చా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్రకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పార్లమెంట్‌లో పార్టీ తరపున సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి ప్రజా సమస్యలను బలంగా వినిపించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే బీఆర్ఎస్ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు.

ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం

దశ,పినపాక : పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే తెలంగాణరాష్ట్రశాసనసభ షెడ్యూల్డ్‌తెగల (ఎస్టీ)సంక్షేమ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా పినపాక మండలం పొట్లపల్లిలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్లపల్లి సర్పంచ్ మద్దెల సమ్మయ్య, మాజీ సర్పంచ్ తొలేం కల్యాణి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తొలేం కృష్ణ, ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం పినపాక మండల అధ్యక్షుడు కొమరం శ్రీను, మహిళలు మరియు పలువురు స్థానిక నాయకులు సంయుక్తంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం మరింత కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.